
ఇచ్చోడ: పోలీస్ స్టేషన్‌లో హోలీ వేడుకల్లో అధికారులు


ఉట్నూర్: ఐటీడీఏ ఈఈ భీంరావ్‌తో హోలీ ఆడుతున్న కాలనీవాసులు


ఆదిలాబాద్‌రూరల్: హోలీ సంబురాల్లో యువకులు


ఇంద్రవెల్లి: కేస్లాగూడలో ...


ఎదులాపురం : రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జైసింగ్‌కు మిఠాయి తినిపిస్తున్న సంఘం జిల్లా అధ్యక్షుడు బండారి కృష్ణ


బోథ్: పోలీస్ స్టేషన్‌లో సీఐ రమేశ్‌కు హోలీ శుభాకాంక్షలు తెలుపుతున్న ఉద్యోగులు


ఉట్నూర్‌రూరల్: ఘన్‌పూర్‌లో ఎంపీపీ పంద్ర జైవంత్‌రావ్

# హోలీ..సంబురాల కేళి

- రంగులు చల్లుకున్న యువత
- ఆకట్టుకున్న నృత్యాలు
- చిన్నారుల కేరింతలు

ఆదిలాబాద్ రూరల్, మార్చి 25 : జిల్లాలో సోమవారం హోలీ పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. పిల్లలు, పెద్దలు అనే తేడా లేకుండా యువతీ, యువకులు ఇలా అందరూ రంగుల్లో మునిగితేలారు. హోలీ పండుగతో జిల్లా రంగుల కేళీగా మారింది. ఎక్కడ చూసిన హోలీ పండుగ సందడి కనిపించింది. రంగులు చల్లుకోవడంతో పాటు రోడ్ల వెంట ఈలలు వేస్తూ యువత ఉత్సాహంలో కేరింతలు కొట్టారు.

### హోలీ వేడుకల్లో ఎమ్మెల్యే జాదవ్ అనిల్

నేరడిగొండ, మార్చి 25: బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ స్వగృహంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులతో కలిసి సంబురాలు జరుపుకున్నారు. ఎమ్మెల్యేకు రంగులు పూసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ హోలీ పండుగలోని రంగుల వలే ప్రజలు ఆనందోత్సహంతో జీవించాలని ఆకాంక్షించారు.

ఉట్నూర్, మార్చి 25: ఏజెన్సీలోని గ్రామగ్రామాన హోలీ పండగను ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఆదివారం రాత్రి పౌర్ణమి సందర్భంగా కామ దహనం నిర్వహించిన ప్రజలు సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు రంగులు చల్లుకొని నృత్యాలు చేస్తూ కేరింతలు కొట్టారు. మండల కేంద్రంలోని అంగడిబజార్‌లో జడ్పీచైర్మన్ రాథోడ్ జనార్దన్, ఐటీడీఏ ఈఈ రాథోడ్ భీంరావ్ నివాసాల్లో రంగులు పూసుకున్నారు.

ఉట్నూర్ రూరల్, మార్చి 25: మండలంలోని ఘన్‌పూర్ గ్రామంలో ఎంపీపీ పంద్ర జైవంత్‌రావ్, శ్యాంపూర్‌లో వైస్ ఎపీపీ దావులే బాలాజీ హోలీ సంబురాల్లో పాల్గొన్నారు. అదే విధంగా బిర్సాయిపేట్, దంతన్‌పల్లి, లక్కారం, ఎక్స్‌రోడ్, శ్యాంపూర్, నాగాపూర్, హస్నాపూర్, పులిమడుగు గ్రామాల్లో పిల్లలు, పెద్దలు, మహిళలు, యువత ఒకరినొకరు రంగులు చల్లుకుంటూ హోలీ పండుగ జరుపుకున్నారు.

ఇచ్చోడ/ఇంద్రవెల్లి/ నార్నూర్, మార్చి 25: ఇచ్చోడ, సిరికొండ, ఇంద్రవెల్లి, నార్నూర్, గాదిగూడల మండలాల్లోని గ్రామాల్లో ప్రజలు హోలీ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఒకరినొకరు రంగులు చల్లుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.


ఉట్నూర్: కామదహనం చేస్తున్న గిరిజనులు

జైనథ్, మార్చి 25 : మండల కేంద్రంతో పాటు లక్ష్మీపూర్, కూర, దీపాయిగూడ, గిమ్మ గ్రామాల్లో హోలీ సంబురాలు అంబరాన్నంటాయి. కార్యక్రమంలో ఎంపీపీ గోవర్ధన్, జడ్పీటీసీ తుమ్మల అరుంధతి వెంకట్ రెడ్డి, మాజీ సర్పంచ్ దేవన్న, గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

తాంసి(తలమడుగు), మార్చి 25 : హోలీ పర్వదినాన్ని పురస్కరించుకొని తాంసి, తలమడుగు మండలాల్లోని గ్రామాల్లో సంబురాలు ఘనంగా నిర్వహించారు. బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌ను బీఆర్ఎస్ నాయకులు కలిసి హోలీ శుభాకాంక్షలు తెలిపారు. తాంసి ఎంపీపీ సురకుంటి మంజుల శ్రీధర్ రెడ్డి, జడ్పీటీసీ తాటిపల్లి రాజు హోలీ ఆడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మాజీ మండల కన్వీనర్, మాజీసర్పంచ్ స్వప్న రత్న ప్రకాశ్, మహేందర్, కేదారేశ్వర్ రెడ్డి, అభిరాం రెడ్డి, రవికాంత్ యాదవ్, వెంకట రమణ, ముచ్చ రఘు, అండె అశోక్, లక్ష్మీపతి, దేవేందర్ పాల్గొన్నారు.

బోథ్, మార్చి 25 : బోథ్, సోనాల, ధన్నూర్(బీ), పొచ్చర, కన్నుగుట్ట, కుచులాపూర్, పట్నాపూర్ గ్రామాల్లో హోలీ పండగను ఘనంగా జరుపుకున్నారు. పోలీస్ స్టేషన్‌లో సీఐ రమేశ్, ఎస్ఐ రాముకు తోటి ఉద్యోగులు రంగులు పూసి హోలీ శుభాకాంక్షలు తెలిపారు. కౌట(బీ) గ్రామంలో మాత్రం మంగళవారం హోలీ పండుగ జరుపుకోనున్నారు.

ఎదులాపురం, మార్చి 25 : జిల్లా కేంద్రంలోని పోలీస్ క్యాంపు కార్యాలయంలో ఎస్పీ గౌష్ ఆలం జిల్లా పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి హోలీ పండుగను ఘనంగా జరుపుకున్నారు. పరేడ్ మైదానం నుంచి సాయుధ పోలీసులు బ్యాండ్ మేళాలతో తరలివెళ్లి ఎస్పీ క్యాంపు కార్యాలయానికి చేరుకొని వేడుకలను నిర్వహించారు. అనంతరం ఎస్పీతో కలిసి నృత్యాలు చేస్తూ రంగులు చల్లుతూ సందడి చేశారు. అనంతరం జిల్లా పోలీసులకు వారి కుటుంబ సభ్యులకు, జిల్లా ప్రజలకు ఎస్పీ హోలీ శుభాకాంక్షలు తెలుపుతూ మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సంబురాల్లో అదనపు ఎస్పీ సురేంద్రరావు, డీఎస్పీలు పోతారం శ్రీనివాస్, ఎల్ జీవన్ రెడ్డి, సీఐలు సత్యనారాయణ, ఎస్బీఐ రమాకాంత్, ఆర్ఐలు మురళి, చంద్రశేఖర్, సీసీ దుర్గం శ్రీనివాస్, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


నేరడిగొండ: హోలీ సంబురాలు జరుపుకుంటున్న బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్

### ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ...

ఎమ్మెల్యే పాయల్ శంకర్ తన ఇంటి వద్ద హోలీ పండుగను నాయకులు, కార్యకర్తలు, ప్రజల మధ్య అభిమానుల సమక్షంలో ఘనంగా జరుపుకున్నారు. తన నివాసానికి వచ్చి తనను కలిసిన వారందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

### స్వగ్రామంలో ఖానాపూర్ ఎమ్మెల్యే హోలీ సందడి

ఉట్నూర్ రూరల్, మార్చి 25: ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ స్వగ్రామం కల్లూర్‌గూడలో గ్రామస్తులు, బంధువులతో కలిసి హోలీ వేడుకలు జరుపుకున్నారు.

### వేడుకల్లో రిమ్స్ డైరెక్టర్, డీఎంహెచ్‌వోలు

ఎదులాపురం,మార్చి 25 : తెలంగాణ వైద్య ప్రజారోగ్య ఉద్యోగుల సంఘం (హెచ్1) ఆధ్వర్యంలో హోలీ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జైసింగ్, డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్‌కు సంఘం జిల్లా అధ్యక్షుడు బండారి కృష్ణ రంగులు పూసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ సేవలు వినియోగించుకోవాలి

ఎదులాపురం, మార్చి 25: ప్రజలు ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలని ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్‌కు సరిపడా బస్సులు నడుపుతున్నట్లు ఆదిలాబాద్ డిపో మేనేజర్ కల్పన తెలిపారు. ప్రయాణికులు సౌకర్యార్థం లహరి, సూపర్ లగ్జరీ, ఎక్స్‌ప్రెస్ బస్సులను హైదరాబాద్‌కు నడుపుతున్నామని పేర్కొన్నారు. రోజు 20 బస్సులు ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్‌కు, మరో 20 బస్సులు హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్‌కు నడుస్తున్నట్లు తెలిపారు. ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్‌కు ఉదయం 5.00, రాత్రి 21.30 గంటలకు ఎక్స్‌ప్రెస్ బస్సులు, ఉదయం 4.00, 5.30, 7.00, 9.00, 10.00, 11.00, 12.30, 14.00, 17.00, 19.00, 21.00, 21.30, 22.00, 23.00, 23.30 సూపర్ లగ్జరీ బస్సులు, 11.30, 13.30, 21.30, 22.30 గంటలకు లహరి బస్సులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్‌కు ఉదయం 4.00, 7.30, 8.30, 8.30, 9.30, 10.30, 11.30,12.30, 14.30, 16.00, 19.00, 20.30, 21.00, 22.30, 23.00 గంటలకు సూపర్ లగ్జరీ బస్సులు, 11.00, 12.00, 21.30, 22.30 గంటలకు లహరి బస్సులు, మధ్యాహ్నం 13.00, రాత్రి 20.00 గంటలకు ఎక్స్‌ప్రెస్ బస్సులు నడుస్తాయని తెలిపారు. ప్రయాణికులు ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని, బస్సు సమయం, ఇతర వివరాలకు ఆర్టీసీ ఎంక్వాయిరీ నంబర్ 8331033707ను సంప్రదించవచ్చని డీఎం సూచించారు.

## బేల్సరిరాంపూర్‌లో దేశీదారు పట్టివేత



పట్టుకున్న దేశీదారుతో పోలీసులు

భీంపూర్, మార్చి 25 : బేల్సరిరాంపూర్‌లో సంతోష్, జైరాం ఇళ్ల వద్ద అక్రమంగా మహారాష్ట్ర దేశీదారు విక్రయిస్తుండగా పోలీసులు ఆదివారం అర్ధరాత్రి పట్టుకున్నారు. వారి నుంచి రూ.10 వేల దేశీదారు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో జైనథ్ సీఐ సాయినాథ్, ఎస్ఐ ప్రదీప్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## నార్నూర్‌లో పడకేసిన పారిశుధ్యం

నార్నూర్, మార్చి 25 : నార్నూర్‌లో పారిశుధ్యం పడకేసింది. మార్కెట్‌లోని ప్రధాన రహదారి పక్కనే కొత్త డ్రైనేజీ నిర్మాణానికి నెల క్రితమే కాలువను తవ్వి వది లేశారు. దీంతో డ్రైనేజీ నిర్మాణం చేపట్టకపోవడంతో మురుగు నీరు నిలిచిపోవడంతో దుర్వాసన, దోమల బేడద తీవ్రమై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నిసార్లు చెప్పినా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రత్యేకాధికారి స్పందించి పారిశుధ్య చర్యలు చేపట్టాలని స్థానికులు, వ్యాపారస్తులు కోరుతున్నారు.


నార్నూర్: ఇంటి ఎదుట నిలిచిన పోయిన మురుగును చూపిస్తున్న వ్యక్తి

# ఒంటి పూట..కనిపెట్టు ఓ కంట..!

- వేసవి దృష్ట్యా పిల్లల విషయంలో అప్రమత్తత అవసరం
- బయటకు వెళ్లకుండా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే..

నార్నూర్, మార్చి 25 : వేసవి దృష్ట్యా పాఠశాలలకు ఒంటి పూట బడులు కొనసాగుతున్నాయి. మధ్యాహ్నం సెలవు కావడంతో పిల్లలు ఆటలాడేందుకు బయటకు వెళ్తుంటారు. ఒక్కోసారి ఆనందం వెన్నంటే విషాదాలు పొంచి ఉండే ప్రమాదం ఉంది. ఈ విషయాన్ని తల్లిదండ్రులు గ్రహించి పిల్లల విషయంలో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. ఒంటి పూట బడుల సమయంలో పిల్లలు సరదాలకు అలవాటు పడి తల్లిదండ్రులు వారించినా ఇంటి పట్టున ఉండేందుకు సుముఖత చూపరు. ఇంట్లో చెప్పాపెట్టకుండా సరదా కోసం బయటకు వెళ్లి ప్రమాదాల బారినపడే అవకాశాలు ఎక్కువ. వారిని కంట కనిపెట్టాల్సిన అవసరం ఎంతైన ఉంది.

### సరదా మాటున ప్రమాదం...

మధ్యాహ్నం పాఠశాలలకు సెలవు కావడంతో పిల్లలు సరదాగా సమీప బావుల్లో, చెరువుల్లో స్నేహితులతో కలిసి ఈత కొట్టేందుకు, నేర్చుకోవడానికి వెళ్తుంటారు. సరదా మాటున ప్రమాదం పొంచి ఉందనే విషయం తల్లిదండ్రులు గ్రహించాలి. ఈత నేర్చుకునే క్రమంలో బావులు, చెరువులు, కుంటలు, వాగుల లోతును అంచన వేయక అందులోకి దిగుతారు. తీరా దిగాక లోతు ఎక్కువగా ఉండడం, మట్టి పేరుకుపోయి ఉండడం, తదితర కారణాల వల్ల చిన్నారులు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంటుంది. తల్లిదండ్రుల పర్యవేక్షణలోనే ఈత నేర్పించాలి, అలాగే ఎండలో తిరగడం వల్ల అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉంది. వడదెబ్బకు గురికావడం, జ్వరం వంటి రావొచ్చు. కాబట్టి వారిని నీడపట్టునే ఉండేలా చూడాలి.


నార్నూర్ సమీపంలోని చెరువులో ఈత కొడుతున్న పిల్లలు

### వాహనాలతో జాగ్రత్త..

ద్విచక్ర వాహనాలు, సైకిళ్లు అంటే పిల్లలకు ఇష్టం ఎక్కువ ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వాటిని నడుపుతూ రోడ్డెక్కితే ప్రమాదాల బారినపడే అవకాశం ఉంది. కాబట్టి వారిని వాటికి దూరంగా ఉంచాలి. అవసరమైతే పెద్దలు పక్కనే ఉండి వాటిని నడపడం నేర్పించాలి.

### ఈ జాగ్రత్తలు తీసుకోండి...

- ఒంటిపూట బడి వదలగానే మధ్యాహ్నం వేళ పిల్లలను అవసరమైతే తప్ప బయటకు పంపొద్దు.
- ఈ సమయంలో వీలును బట్టి తల్లిదండ్రులు తమ పిల్లలతో గడిపేందుకు ఎక్కువ సమయాన్ని కేటాయించాలి.
- ఇంటి పట్టున ఉండే పిల్లలకు వారి పని (హోంవర్కు)లో సాయం చేస్తూ తల్లిదండ్రులు వారిని ప్రోత్సహించాలి.
- పాఠశాల నుంచి మధ్యాహ్నం ఇంటికి వచ్చాక చిన్నారులకు పుస్తక పఠనం అలవాటు చేయాలి. నీతి కథలు, స్ఫూర్తిగాథలు చదివే విధంగా ప్రోత్సహించాలి. తద్వారా చిన్నారులు ఇంటి పట్టున ఉండే అవకాశం ఉంది.
- అవసరమైతే నీడ పట్టున ఆడుకునే ఆటలకు ప్రాధాన్యం ఇవ్వాలి. చదరంగం, క్యారమ్స్ వంటి ఆటలు ఆడేలా చూడాలి.

### నీరు ఎక్కువగా తీసుకోవాలి...



వేసవి దృష్ట్యా పిల్లలు ఎక్కువగా నీరు తాగేలా చూడాలి. మధ్యాహ్నం సమయంలో బయటకు వెళ్లకుండా ఇళ్లలోనే ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఎండలు ఎక్కువయ్యే కొద్ది పిల్లలు ఆహారం తీసుకునేందుకు మారం చేసే అవకాశం ఉంది. ఇలాంటి వారితో పండ్ల రసాలు ఎక్కువగా తాగించాలి. పిల్లల విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలి.

-రాంబాబు, మండల వైద్యాధికారి, నార్నూర్

## కరంజి(టీ) చేరుకున్న పాదయాత్రికులు


పాదయాత్రికులను సాగనంపుతున్న కరంజి(టీ) గ్రామస్తులు

భీంపూర్, మార్చి25: మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లా వడ, డాకొరి గ్రామాలకు చెందిన 120 మంది పాదయాత్రికులు పండరిపూర్ వెళ్తూ ఆదివారం రాత్రి భీంపూర్ మండలం కరంజి(టీ)లో బస చేశారు. గ్రామంలోని రామాలయంలో భజనకీర్తనలు చేశారు. సోమవారం ఈ బృందాలకు గ్రామస్తులు డప్పువాయిద్యాలతో వీడ్కోలు పలికారు. కాగా ఈ యాత్రలో మహారాష్ట్ర గుబిడి గ్రామం వద్ద ఒక గోవు చైతన్య మహారాజ్ చెంతకు రాగా అతను పాలు తాగించాడు. వారి వెంట కరంజి ఆధ్యాత్మిక మండలి ప్రతినిధులు రెడ్డి విలాస్, అని , జక్కు పంజాబ్‌రెడ్డి , గుర్ల విఠల్ ఉన్నారు.

## ఓ వర్గంపై మరో వర్గం దాడి

ఎదులాపురం, మార్చి 25 : ఆదిలాబాద్‌లోని కొలిపూర సమీపంలో పూలమార్కెట్‌రోడ్డు వద్ద సోమవారం ఇరువర్గాల మధ్య గొడవ ఉద్రిక్తతకు దారి తీసింది. ఓ వర్గానికి చెందిన అమ్మాయి హైదరాబాద్‌లోని ఓ సూపర్ మార్కెట్‌లో పని చేస్తున్న క్రమంలో జిల్లా కేంద్రానికి చెందిన మరో వర్గానికి చెందిన అబ్బాయితో పరిచయం ఏర్పడింది. ఇది కాస్తా ప్రేమగా మారింది. దీంతో వారు మేజర్లు కావడంతో ఇద్దరు ఈ సంవత్సరం జనవరిలోనే హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్‌లో పెండ్లి చేసుకొని ఆదిలాబాద్‌లోని పూలమార్కెట్ రోడ్ సమీపంలో నివసిస్తున్నారు. హైదరాబాద్ నుంచి అమ్మాయి తరపున వచ్చిన కుటుంబ సభ్యులు, స్థానికులు కలిసి అమ్మాయి ,అబ్బాయిని చితకబాదారు. అడ్డుగా వచ్చిన అబ్బాయి తండ్రిని సైతం చేతులతో కొట్టారు. ఈ విషయం తెలుసుకున్న వన్ టౌన్ పోలీసులు అక్కడికి చేరుకొని వారిని అదుపులోకి తీసుకున్నారు. అబ్బాయి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అమ్మాయి తల్లిదండ్రులు, స్థానికులపై కేసు నమోదు చేశారు. దౌర్జన్యంగా అబ్బాయి,అమ్మాయిని, అడ్డువచ్చిన తండ్రిపై దాడి చేసినందుకు, అమ్మాయిని కిడ్నాప్ చేసేందుకు ప్రయత్నించినందుకు, సహకారం అందించిన మరి కొందరిపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ జీవన్ రెడ్డి తెలిపారు.

## పోచమ్మ ఆలయంలో బోర్ ఏర్పాటు

దస్తురాబాద్, మార్చి 25 : మండల కేంద్రానికి చెందిన మారవేణి రాజారెడ్డి జ్ఞాపకార్థం ఆయన చిన్న కుమారుడు మారవేణి శేఖర్ భూత్కుర్ గ్రామంలోని ముత్యాల పోచమ్మ ఆలయంలో తన సొంత నిధులతో బోరు వేయించి ఉదారతను చాటుకున్నాడు. నిత్యం ఆలయానికి పెద్దసంఖ్యలో భక్తులు వస్తుంటారు. వారి సౌకర్యార్థం తాగునీరు అందించేందుకు తన తండ్రి జ్ఞాపకార్థం ఉచితంగా బోర్ వేయించినట్లు శేఖర్ తెలిపారు. శేఖర్‌కు అమ్మవారి భక్తురాలు మారాజు పోశవ్వ, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

## భక్తిశ్రద్ధలతో ధ్వజారోహణం

తాంసి(తలమడుగు), మార్చి 25: తలమడుగు మండలం పల్లి(కే) గ్రామంలో సద్గురు శ్రీ శబరిమాత ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయంలో సోమవారం ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. శబరిమాత పల్లకీని మంగళ వాయిద్యాలతో భజన చేస్తూ, భక్తిగీతాలు ఆలపిస్తూ గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అయ్యప్ప ఆలయంలో హుండీ చోరీ


స్వాధీనం చేసుకున్న నగదుతో పోలీసులు

తాంసి(తలమడుగు), మార్చి 25: తలమడుగు మండలం సుంకిడి గ్రామంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో సోమవారం మధ్యాహ్నం హుండీ చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉదయం 10 గంటలకు మహారాష్ట్ర మాండవ గ్రామానికి చెందిన దౌండీవార్ రాజేశ్వర్ ఆలయంలో ప్రవేశించి, భక్తులు కానుకలు సమర్పించుటకు పెట్టిన హుండీ దొంగలించి పారిపోయాడు. గమనించిన స్థానికులు అతడిని పట్టుకొని పోలీసులు సమాచారం అందించారు. ఆలయ కమిటీ సభ్యుల ఫిర్యాదు మేరకు దొంగలించబడిన స్టీలు హుండీ రూ.7950 నగదు స్వాధీనం చేసుకొని రాజేశ్వర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ధనశ్రీ తెలిపారు.

## ఉదారత చాటుకున్న దంపతులు

జైనథ్, మార్చి 25 : కామాయి గ్రామానికి చెందిన జైనథ్ మార్కెట్ డైరెక్టర్ కేతిరెడ్డి సురేందర్ రెడ్డి పద్మరెడ్డి సోమవారం తమ మనవరాలు పుట్టిన రోజు సందర్భంగా గ్రామంలోని 50 కుటుంబాలకు టిఫిన్ డబ్బాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు విష్ణు వర్ధన్ రెడ్డి, శ్రీజారెడ్డి, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సీఐకి సన్మానం


సీఐకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

ఉట్నూర్, మార్చి 22: ఉట్నూర్ సీఐగా బాధ్యతలు స్వీకరించిన మొగిలిని సోమవారం జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శి, న్యాయవాది బానోత్ జగన్ ఆధ్వర్యంలో సన్మానించారు. హోలీ పండుగను పురస్కరించుకొని డీఎస్పీ నాగేందర్, సీఐ మొగిలి, ఎస్ఐ మనోహర్‌కు రంగులు చల్లారు. అనంతరం పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో బంజారా సంఘం నాయకులు విజయ్ కుమార్, వసంత్‌రావ్ ఉన్నారు.